


ఉక్కుపై ఆంక్షలు

- విదేశీ పర్యటనలకు ఫుల్‌స్టాప్
- ఎగ్జిక్యూటివ్‌లు ఇకపై ఎకానమీ హోటళ్లలోనే బస చేయాలి
- క్వార్టర్లలో ఉంటున్న సిబ్బంది నుంచి విద్యుత్ ఛార్జీలు వసూలు



- వార్త మెయిన్‌లో

కాలుష్య నియంత్రణపై కానరాని చిత్తశుద్ధి

- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద నగరానికి రూ.129.25 కోట్లు విడుదల
- ఆ నిధులు ఖర్చు చేయడంలో గత పాలకులు విఫలం
- నగరంలో పెరుగుతున్న కాలుష్యం
- ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టిసారించకుంటే
- సమస్య మరింత తీవ్రం

వైసీపీ హయాంలో మరీ దారుణం

- కేంద్ర నిధులనూ మురగబెట్టిన వైనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖను రాజధాని చేస్తామంటూ ఊదరగొట్టిన వైసీపీ పాలకులు కనీసం నగరంలో కాలుష్యం తగ్గించేందుకు కేంద్రం ఇచ్చిన నిధులను కూడా వినియోగించుకోలేక పోయిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దేశంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య సమస్య పరిష్కారానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేందుకు యత్నిస్తాయి. కానీ, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి...ఆ దిశగా ప్రయత్నం చేయకపోగా, ఇచ్చిన వాటిని కూడా ఖర్చు చేయలేక పోయారు.

దేశంలో 131 నగరాలు, పట్టణాల్లో కాలుష్య తీవ్రత తగ్గించడానికి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను 2019లో కేంద్రం ప్రారంభించింది. రాష్ట్రంలో విశాఖతోపాటు మొత్తం 13 నగరాలు, పట్టణాలను ఈ పథకం కింద ఎంపిక చేసింది. 2019-20 నుంచి ఐదేళ్లపాటు ప్రతి నగరానికీ నిధులు కేటాయించింది. దీనిలో భాగంగా విశాఖ నగరానికి రూ.129.25 కోట్లు కేంద్రం విడుదల చేసింది. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం సీఎంఎఫ్ఎస్‌లో జమ చేసింది తప్ప నేరుగా విశాఖ నగర పాలక సంస్థకు కేటాయించలేదు. కేంద్రం ఇచ్చి నిధుల్లో కేవలం రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకూ మాత్రమే ఖర్చు చేసింది. నగరంలో కాలుష్య తీవ్రత తగ్గింపులో భాగంగా రోడ్ల విస్తరణ, క్లీనింగ్ యంత్రాలు కొనుగోలు, ఇంటింటికీ డస్ట్‌బిన్‌ల ... మిగతా 6వ పేజీలో

క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నిధులతో ఏం చేయాలంటే...

నగరాల్లో కాలుష్యం తీవ్రత తగ్గించేందుకు ప్రధానంగా కూడళ్ల వద్ద రహదారుల విస్తరణ చేపట్టాలి. దీనివల్ల వాహనాలు నిలిచే పరిస్థితి ఉండదు. అలాగే రోడ్లను మెకానికల్‌గా శుభ్రం చేసే మిషన్లు కొనుగోలు, ముఖ్యమైన రహదారులు కలిసేచోట మట్టి/గోతులు లేకుండా చూడడం చేయాలి. డివైడర్ల మధ్యలో, రోడ్లకు ఇరువైపులా చెట్లు పెంచాలి. రోజువారీ ఉత్పత్తి అయ్యే చెత్తను క్లోజ్డ్ వాహనాల్లో డంపింగ్ యార్డులకు తరలించే యంత్రాంగం సమకూర్చాలి. కాలుష్యం ఎక్కువగా ఉండే కూడళ్లలో వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటుచేయాలి. వాహనాలు రోడ్లపై ఎక్కువసేపు నిలిచిపోకుండా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించాలి. నగరంలో కాలుష్య తీవ్రతను కొలిచేందుకు తొలిదశలో మధురవాడ, గాజువాకల్లో యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ యంత్రాలను నెలకొల్పాలి. కాలుష్య నియంత్రణలో ప్రజలు, విద్యార్థులు, పారిశ్రామిక సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలను భాగస్వామ్యం చేయడం ద్వారా చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలి.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి దూరం

- టీడీపీ అధిష్ఠానం నిర్ణయం
- నామినేషన్ల దాఖలుకు నేటితో ముగియనున్న గడువు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని 'కూటమి' నిర్ణయం తీసుకుంది. విజయం సాధించేందుకు అవసరమైన బలం లేనందున పోటీ చేయకపోవడమే మంచిదని మెజారిటీ నేతలు అభిప్రాయపడినట్టు చెబుతున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి అధిష్ఠానం కూడా సూచనప్రాయంగా సంకేతాలు పంపింది. కాగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు (జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జీవీఎంసీ కార్పొరేటర్లు, నర్సీపట్నం, ఎలమంచిలి కౌన్సిలర్లు) ఉన్నారు. ఎన్నికల్లో గెలుపొందాలంటే 420 ఓట్లు రావాలి. కూటమికి రమారమి 300 ఓట్లు ఉన్నాయి. మిగిలిన 120 ఓట్లు సమీకరించుకునే స్థాయి అధికార పక్షానికి ఉంది. అయినా పోటీపై అధిష్ఠానం ఆలోచనలో పడినట్టు తెలిసింది. ఒక ఎమ్మెల్సీ సీటు కోల్పోయినంత మాత్రాన వచ్చే నష్టమేమీ ఉండదని నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా నామినేషన్ల దాఖలుకు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు ఉంది. ఈలోగా ఏమైనా నిర్ణయం మారితే తప్ప పోటీకి దూరంగా ఉండడం దాదాపు ఖాయమని తెలిసింది. దీనిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సోమవారం రాత్రి వరకు ఉన్న సమాచారం అయితే ఇదేనని, ఒకవేళ మంగళవారం ఉదయం ఏమైనా అధినేత నిర్ణయం తీసుకుంటే దానికి అనుగుణంగా ముందుకువెళతామన్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బొత్స నామినేషన్

- బలంలేని కూటమి అభ్యర్థిని నిలబెడితే దుశ్చర్య అవుతుంది
- వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స



- వార్త మెయిన్‌లో

భీమిలి

మెడకు చుట్టుకున్న ఇనాము భూముల వ్యవహారం

సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

- రిజిస్ట్రేషన్‌కు తగిన పత్రాలు లేకపోయినా తిరస్కరించకపోవడంపై అనుమానాలు
- ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం
- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సదరు అధికారి బంధువు



భీమిలి సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

భీమిలి సబ్ రిజిస్ట్రార్ వి.తులసీదాస్‌ను ప్రభుత్వం సోమవారం సస్పెండ్ చేసింది. సరైన పత్రాలు లేని ఆస్తి రిజిస్ట్రేషన్‌కు 38 డాక్యుమెంట్లు రాగా వాటిని వెంటనే తిరస్కరించకుండా ఎక్కువ కాలం ఉంచుకున్నందుకు, దానిపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ స్థానంలో ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న గోపీ అని అధికారిని తాత్కాలికంగా నియమించారు.

ఇదీ వివాదం

పద్మనాభం మండలం బి.తాళ్లవలసలో సుమారుగా 180 ఎకరాల ఇనాము భూములు ఉన్నాయి. వాటిని కాజేయాలని చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో ఆ గ్రామంలో సర్వే చేయించారు. ఇనాము ఎంత?, జిరాయితీ ఎంత లెక్క తేల్చడానికి ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కొన్ని వివాదాలు రేగడంతో సీసీఎల్ఏ వద్దకు ఫైల్ చేరింది. అయితే రెండేళ్ల క్రితం ఓ దళారి ఆ ఇనాం భూముల్లో కొంత రైతుల నుంచి వేరే వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించేందుకు యత్నించారు. సుమారు 38 డాక్యుమెంట్లు భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించారు. వాటిని తీసుకున్న సబ్ రిజిస్ట్రార్ వి.తులసీదాస్ 1బీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో వాటి వివరాలు చూశారు. అక్కడ ఆ మండల తహసీల్దార్

వైసీపీ నేతలకు కొమ్ము కాశారని ఆరోపణలు

డిజిటల్ సంతకం కనిపించలేదు. అంటే అక్కడ ఏదో తేడా ఉందని అర్థం. పైగా అవి ఇనాము భూములు కాబట్టి వాటిని సరైన పత్రాలు లేకుండా రిజిస్టర్ చేయకూడదు. అనుమానాలు ఉన్నందున వాటిని వెంటనే తిరస్కరించి, వెనక్కి ఇవ్వాలి. కానీ ఆయన ఆ పని చేయలేదు. 2022 జూన్ 6న సమర్పిస్తే 2023 డిసెంబరు ఏడో తేదీ వరకూ తన వద్దే ఉంచుకున్నారు. ఈ మధ్య కాలంలో పెండింగ్ రిజిస్ట్రేషన్లపై జిల్లా అధికారులు ప్రశ్నిస్తే వారికి కూడా సరైన సమాధానం ఇవ్వలేదు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చాక అసైన్డ్ సహా ఇతర ప్రభుత్వ భూములు ఏమైనా చేతులు మారాయా?, రిజిస్ట్రేషన్లు ఎన్ని జరిగాయి?... అనే వివరాలు కోరింది. ఆ క్రమంలో భీమిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎక్కువ కాలం పెండింగ్ ఉన్న డాక్యుమెంట్ల విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో ఐజీ కార్యాలయం దృష్టి సారించింది. సరైన పత్రాలు లేని డాక్యుమెంట్లను వెంటనే తిరస్కరించి పంపకుండా ఎందుకు పెండింగ్‌లో ఉంచారని వివరణ కోరింది. దానికి సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్ పొంతలేని వివరణ ఇచ్చారు. వాటిని రిజిస్టర్ పోస్టులో పంపానని ఒకసారి, స్వయంగా ఆ పార్టీ చేతికి ఇచ్చానని మరోసారి సమాధానం ఇచ్చారు. పైగా ఆ పార్టీలు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు మార్పించి, డిజిటల్ సంతకం చేయిస్తామని చెప్పారని, అందుకే వాటిని ఉంచుకున్నానని ... మిగతా 6వ పేజీలో

పాచిపోయిన చికెన్

రోజుల తరబడి నిల్వ ఉంచిన చికెన్ లాలీ పప్‌లు, కర్రీ

- ఇన్నోసెంట్ బ్యాచిలర్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, గ్రీన్ వ్యాలీ రెస్పో కేఫ్‌లలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు జరిపిన తనిఖీల్లో బహిర్గతం
- నాలుగు రోజుల క్రితం మిగిలిపోయిన ఆహార పదార్థాలను వేడి చేసి వినియోగదారులకు వడ్డిస్తున్నట్టు గుర్తింపు
- ల్యాబ్‌కు నమూనాలు

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కొన్ని రెస్టారెంట్ల నిర్వాహకుల తీరు మారడం లేదు. రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వేడి వేసి వినియోగదారులకు వడ్డిస్తున్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీపీబీ నందాజీ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ పరిధిలో ఆహార భద్రత, ప్రమాణాల శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్లు జరిపిన తనిఖీల్లో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగుచూశాయి. పాత జైలు రోడ్డు, రామ్‌నగర్ ప్రాంతాల్లోని ఇన్నోసెంట్ బ్యాచిలర్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, గ్రీన్ వ్యాలీ రెస్పో కేఫ్‌లో రోజుల తరబడి నిల్వ ఉంచిన గుడ్లు, పాచిపోయిన చికెన్ జాయింట్లు, లాలీపప్‌లు, బూజు పట్టిన మసాలా పేస్టులు, చికెన్ కర్రీని గుర్తించారు. నాలుగు రోజుల కిందట వండగా మిగిలిపోయిన ఆహార పదార్థాలను వేడి చేసి వినియోగదారులకు అందిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందుకోసం టేస్టీ సాల్ట్, కొన్నిరకాల కలర్స్ వినియోగిస్తున్నట్టు అధికారులు తేల్చారు. ఒక్కో హోటల్‌లో సుమారు పది కిలోల చొప్పున చికెన్ జాయింట్లు, చికెన్ కర్రీ, ఇతర ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. వాటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఫలితాలు వచ్చిన తరువాత రెస్టారెంట్స్ నిర్వాహకులకు జరిమానా విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీలను ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రానున్న రోజుల్లోనూ ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, బయట ఫుడ్ తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.



నాలుగు రోజులుగా నిల్వ ఉంచడంతో కుళ్లిపోయినట్టు కనిపిస్తున్న ఆహార పదార్థాలు

నిల్వ ఉంచిన, పాడైన ఆహార పదార్థాలను వేడి చేసి తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. మళ్లీ మళ్లీ వేడి చేసిన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలు, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

చర్యలు శూన్యం

ఆహార భద్రతా, ప్రమాణాల శాఖకు చెందిన అధికారులు తనిఖీలు చేసిన ప్రతిసారి ఈ తరహా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు బయట పడుతున్నాయి. అయితే అటువంటి రెస్టారెంట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే మిగిలిన వారికి భయం ఉండడం లేదు. అందు కే నిల్వ ఉంచిన ఆహార పదార్థాల విక్రయాలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో దొరికిన వారికి భారీగా జరిమానాలు విధించడంతోపాటు రెస్టారెంట్ సీజ్ చేయాలని, అప్పుడే ఈ తరహా ఆహార పదార్థాలు విక్రయానికి అడ్డుకట్ట పడేం దుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

సిక్ లీవులో మాజీ వీసీ ప్రసాదరెడ్డి

విచారణ కమిటీ నుంచి తప్పించుకునేందుకేనా?



విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి అంతా తాను అనుకున్నట్టుగానే చేస్తున్నారు. ఆయన విధులకు సకాలంలో హాజరు కావడం లేదని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవలసిన ... మిగతా 6వ పేజీలో

కలకలం రేపిన శిశువు విక్రయ వ్యవహారం

- రూ.7.5 లక్షలకు బేరం
- బిడ్డ తండ్రితోపాటు తొమ్మిది మంది అరెస్టు
- మరికొందరు నిందితుల కోసం పోలీసులు గాలింపు
- కేజీహెచ్‌లోని డయాగ్నోస్టిక్ సెంటర్ టెక్నీషియన్ మధ్యవర్తిత్వం

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో కలకలం రేపిన ఆడ శిశువు విక్రయం కేసులో తొమ్మిది మందిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శిశువును వైద్య చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు, నిందితులను రిమాండ్‌పై కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉండడంతో పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించడంలో గోప్యత పాటిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కంచరపాలెం సమీపంలోని కప్పరాడ ప్రాంతవాసి ఐదు నెలల కిందట ప్రసవం కోసం కేజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో వైద్యులు స్కానింగ్ చేయాల్సి ఉండడంతో ఆస్పత్రి ఆవరణలోని మెడాల్ డయాగ్నోస్టిక్స్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. దంపతులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్టు గుర్తించాడు. పుట్టబోయే బిడ్డను విక్రయిస్తే రూ.పది లక్షలు వరకూ వస్తాయని ఆశచూపించాడు. ఆర్థిక ఇబ్బందులతోపాటు వారి అనారోగ్యం కారణంగా శిశువును విక్రయించేందుకు ఆ దంపతులు సంసిద్ధత వ్యక్తంచేశారు. దీంతో అతను...ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తన స్నేహితుడికి విషయం చేరవేశాడు. ఇద్దరూ కలిసి పిల్లల కోసం అప్పటికే తమను సంప్రతించిన రాంబిల్లి ప్రాంతానికి చెందిన దంపతులకు సమాచారం ఇచ్చారు. రాంబిల్లికి చెందిన ఇద్దరు పెళ్లి చేసుకోకుండా గత పదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. తమ వృద్ధాప్యంలో బాగోగులు చూసేందుకు బిడ్డ అవసరమని శిశువును కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆస్పత్రిలో ఉండగా శిశువును విక్రయిస్తే ఇబ్బందులు ... మిగతా 6వ పేజీలో

ఏయూ జోరు

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరుగుపడిన ర్యాంకు

- ఓవరాల్ కేటగిరీలో 41వ స్థానానికి ఎగబాకిన వర్సిటీ
- యూనివర్సిటీల కేటగిరీలో 25వ స్థానం
- తొలిసారి ప్రకటించిన స్టేట్ యూనివర్సిటీస్ కేటగిరీలో ఏడో స్థానం
- మేనేజ్‌మెంట్ స్టడీస్ కేటగిరీలో ఐఐఎంకు 26వ స్థానం



విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాకింగ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ ఏడాది మెరుగైన స్థానం దక్కించుకుంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ సోమవారం సాయంత్రం ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను విడుదల చేసింది. ఏయూ పలు కేటగిరీల్లో మెరుగైన ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయిలో ఓవరాల్ కేటగిరీలో 55.97 స్కోరుతో ఏయూ 41వ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో గడిచిన ఏడాది 76వ స్థానంలో ఉన్న ఏయూ ఏడాది వ్యవధిలో తన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. ఇక, విశ్వ విద్యాలయాల విభాగంలో 57.67 స్కోరుతో 25వ స్థానాన్ని సాధించింది. గత ఏడాది ఇదే కేటగిరీలో 43వ స్థానంలో నిలిచిన ఏయూ ఈసారి 18 స్థానాలను మెరుగుపరచుకుంది. ఇంజనీరింగ్ విభాగంలో 45.6 స్కోరుతో 90వ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది ఇదే విభాగంలో 94వ స్థానంలో ఉంది. ఫార్మసీ విభాగంలో ఏయూ ఫార్మసీ కళాశాల 56.11 స్కోరుతో 34వ స్థానాన్ని సాధించింది. గత ఏడాది (22వ స్థానం)తో పోలిస్తే ఏయూ ఫార్మసీ కళాశాల వెనుకబడింది. లా విభాగంలో వర్సిటీలోని న్యాయ కళాశాల 58.75 స్కోరుతో 16వ స్థానంలో, దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం 47.94 స్కోరుతో 39వ స్థానం దక్కించుకున్నాయి. అదేవిధంగా ఈ ఏడాది తొలిసారిగా విడుదల చేసిన దేశంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కేటగిరీలో ఏయూ టాప్ 10లో చోటు దక్కించుకుంది. తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ ప్రథమ స్థానంలో ఉండగా, ఏయూ 65.96 స్కోరుతో ఏడో స్థానంలో నిలిచింది. రెండు తెలుగు ... మిగతా 6వ పేజీలో

మోడలింగ్ పోటీల్లో తన్వీరిషిక ప్రతిభ



పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన తన్వీరిషిక

మహరాణిపేట, ఆగస్టు 12: థాయ్ లాండ్‌లో జరిగిన మోడలింగ్ పోటీల్లో నగరానికి చెందిన తన్వీరిషిక ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. అక్కడ ఇటీవల జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలకుతన్వీ రిషిక పాల్గొని ద్వితీయ స్థానం ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ తల్లిదండ్రులు రేణుక, సురేశ్ మాట్లాడుతూ ప్యాషన్ రంగంలో కుమార్తె ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. గతంలో విశాఖలో నిర్వహించిన ఆంధ్ర ప్యాషన్ పోటీల విజేతగా నిలిచినట్టు చెప్పారు.

'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 12: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నిషా ముక్త్ అభియాన్ 5వ వార్షికోత్సవం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని డీఈవో ఆదేశించినట్టు సందర్భంగా ప్రధానోపాధ్యాయి లక్ష్మీనరస తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథ్, పీడీ ఎ.సునంద్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పూజలు



అమ్మవారు

పూర్ణామార్కెట్, ఆగస్టు 12: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు సోమవారం శ్రావణలక్ష్మిగా పూజలందుకున్నారు. అలాగే, అమ్మవారికి కుంకుమపూజలను ఉభయదాతలతో అర్చకులు చేయించారు. శ్రావణలక్ష్మి అలంకరణలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఇబ్బందులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

రైల్వే పార్కు ఆక్రమణ

» గేదెలు, ఆవులు పెంపకం.. అసాంఘిక కార్యకలాపాలతో అవస్థలు



తాటిచెట్లపాలెం వద్ద రైల్వే పార్కులో ఆవులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 12: రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో విలువైన రైల్వే పార్కును ప్రైవేటు వ్యక్తులు వారి అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. తాటిచెట్లపాలెం 80 అడుగుల రోడ్డు సమీపంలో రైల్వే క్వార్టర్స్ నంబర్ 835 పక్కన గల సిబ్బంది సేద తీరేందుకు ఈ ఉద్యానవనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. కొంత కాలంపాటుఇక్కడ రైల్వే క్వార్టర్లలో ఉన్న కుటుంబాల వారు సాయంత్రం వేళల్లో ఈ పార్కుకు వచ్చి సేద తీరేవారు. అయితే, కొన్నాళ్లుగా ఇక్కడ కొంతమంది స్థానికులు పార్కు స్థలాన్ని ఆక్రమించి గేదెలు, ఆవులను మేపుతున్నారు. అలాగే, భవన నిర్మాణ సామగ్రిని వేస్తున్నారు. దీంతో ఆ స్థలంలో చెత్తా చెదారంతో నిండి డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీనికితోడు ఆ పార్కు స్థలంలో కొందరు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పార్కులోని మొక్కలను కూడా తొలగించడంతో కళావిహీనంగా మారింది. ఈ రైల్వే పార్కులోకి ప్రైవేట్ వ్యక్తులు రైల్వే క్వార్టర్స్ సిబ్బందిని అనుమతించడం లేదు. ఇకనైనా రైల్వే అధికారులు స్పందించి ఆ పార్కును స్వాధీనం చేసుకుని మరమ్మతులు చేసి అం దుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

'జెండా ఉంచా రహే హమారా' రేపు

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: దేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14న 'జెండా ఉంచా రహే హమారా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు ఆర్.బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకలకు ముందురోజు ఎల్ఐసీ సమీపంలోని ప్రభుత్వ మహిళా కళాశాల సిటీ సెంట్రల్ పార్కు వేదికగా వేలాదిమంది విద్యార్థులతో జాతీయ జెండా ఆవిష్కరిస్తామన్నారు. 25 వేల చదరపు అడుగుల త్రివర్ణపతాకంతో నిర్వహించనున్న ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ప్రదీప్‌రాజు, నరేష్, కుమార్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ

మహారాణిపేట, ఆగస్టు 12: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనమండలి సభ్యుడు వి. చిరంజీవిరావు అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం 22 సంఘాలతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. పలు సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. గతంలో హామీ ఇచ్చినట్టు 117 జీవోను రద్దు చేస్తారన్నారు. వర్కు అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ ఈనెల 16వ తేదీనుంచీ ప్రారంభం కానుందన్నారు. మెరిట్ రోస్టర్ విధానానికి అనుగుణంగా సినియారిటీ నిర్ణయిస్తామన్నారు.ప్రతీ పాఠ శాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండేలా చూడాలన్న అభ్యర్థనను ప్రభు త్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. ఏ పాఠశాలా మూతపడే పరిస్థితిఉండదని అన్నారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి: ఎస్ఐ

సీతంపేట, ఆగస్టు 12: వసతి గృహాల్లో తప్పనిసరిగ్గా సీసీ కెమెరాలుఉండాలని క్రైమ్ ఎస్ఐ రవి పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డులోని మహిళ హస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు చోరీలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలు విజేతలు వీరే..



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 12: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆ ధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-13 బాలుర, బాలికల చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. లయన్స్ క్లబ్‌లో జరిగిన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 135 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించా రు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో తనీష్, వంశీ...బాలికల విభాగంలో గొర్లె నైన, లహరి తొలి రెండు స్థానాలలో విజేతలుగా నిలిచారు. ఈ నలుగురు చిన్నారులు త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్యాల కోటేశ్వరరావు, కార్యదర్శి పలిశెట్టి లక్ష్మన్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబురావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బలివాడ సత్యారావు, బోయిన బాబురావు, చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు పాల్గొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెంలోని రామచంద్రానగర్ నాల్గో లైన్‌లో ఈ నెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ శిబిరానికి వైద్యులు వి.మన్మధరావు, ఆనందకుమారి, శ్రీనివాసా ల్యాబ్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలతోపాటు అవసరమైన మందులు అందజేయనున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే 'కూన'ను కలిసిన 'సనపల'



కూన రవికుమార్‌ను సత్కరిస్తున్న వరప్రసాద్

మాధవధార, ఆగస్టు 12: ఆమదాలవలస శాసన సభ్యుడు కూన రవికుమార్‌ను శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో టీడీపీ విశాఖపార్లమెంట్ అధికార ప్రతినిధి, 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించి సాయిబాబా జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గత 35 ఏళ్లనుంచి టీడీపీ పటిష్టత కోసం పాటు పడుతున్నామని, రానున్న నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని వరప్రసాద్ కోరారు. మురళీనగర్ ప్రాంతంలో జంట గ్రామాల భూములను నిషేధిత భూముల జాబితా (22ఎ)లో చేర్చడంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వివరించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో దొరికిన ఫోన్ అందిస్తున్న డ్రైవర్

అక్కయ్యపాలెం, ఆగస్టు 12 : దొరికిన ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌ను ఆటో డ్రైవర్ ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో సోమవారం తిరిగి బాధితుడికి అప్పగించారు.వివరాలిలా ఉన్నాయి. పాడేరుకు చెందిన సతీశ్ ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హస్పిటల్ వైపువెళుతుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఈ సెల్‌ఫోన్ ఆటో డ్రైవర్ పైడిరాజు దొరికింది. ఆయన తన తోటి ఆటో డ్రైవర్లతో కలిసి ఈ విషయం పోలీసులకు తెలిపారు.నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి. వాణిశ్రీ, ఏఎస్సై రమణ సమక్షంలో ఈ సెల్‌ఫోన్‌ను బాధితుడు సతీశ్‌కు సోమవారం అప్పగించారు. పోలీసులు ఆటో డ్రైవర్ పైడిరాజు నిజాయితీని అభినందించారు.

ఇరువర్గాల మధ్య తగాదా

కంచరపాలెం, ఆగస్టు 12: ఊర్వశి జంక్షన్ సమీపాన నలందనగర్‌లో ఇరువర్గాల మధ్య సోమవారం రాత్రి వివాదం నెలకొంది. నలందనగర్‌లో ఏడుగురు యజమానుల పేరుతో 99 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. దీనిలో కొంత భాగంగా వినాయక, దుర్గాదేవి ప్రతిమలు తయారు చేసే రాజస్థాన్‌కు చెందిన కళాకారులకు యజమానులు అద్దెకు ఇచ్చారు. బొమ్మలు తయారు చేసే వారి కుటుంబాల్లో గొడవలు నేపథ్యంలో ఇటీవల వారిని ఇక్కడ నుంచి సంబంధిత యజమానులు ఖాళీ చేయించారు. అయితే, బొమ్మలు అమ్మే వ్యక్తి తమకు డబ్బు ఇవ్వాలంటూ ఆ స్థలంలోకి కొంత మంది వ్యక్తులు సోమవారం ప్రవేశించి ఆక్రమణకు యత్నం చేశారు. దీంతో స్థలానికి చెందిన యజమానులు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కంచరపాలెం పోలీసులు వచ్చి ఇరువర్గాలను పంపించేశారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

» ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వాంబే కాలనీలో శిథిల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని కనకలదిబ్బ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవనానికి సమీపాన ఉన్న వాంబే కాలనీ ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ఈ సమస్యను వారు సోమవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే ఆయన స్పందించి అక్కడికి వెళ్లి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనానికి ఆనుకుని ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించిన తర్వాత పనులు కొనసాగించాలని అధికారులను కోరారు.వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

20ఏ బస్సు పునరుద్ధరించాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రం అందచేస్తున్న ప్రకాశరావు

సీతమ్మధార, ఆగస్టు 12: సీతమ్మధార, హెచ్‌బీ కాలనీలకు 20 ఏ సిటీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి సామాజిక కార్యకర్త నరవ ప్రకాశరావు వినతి పత్రం సమర్పించారు. 1983 నుంచి 20ఏ బస్సు హెచ్‌బీ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్ నడిచేదని, దీనిని కొన్నాళ్ల కిందట నిలిపివేశారన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలు ఆశ్రయించడం వల్ల అధికంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'మైనారిటీల హక్కుల పరిరక్షణే ధ్యేయం'



మహ్మద్‌గౌస్‌కు నియామక పత్రమిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: విశాఖ జిల్లా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన సంఘ సేవకుడు మహ్మద్‌గౌస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ ఫారుఖ్‌షుబ్లీ విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఫారూఖ్ మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. మహ్మద్‌గౌస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కేటాయించడంపై జిల్లా అధ్యక్షులు అస్లమ్‌ఖాన్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

రక్షణ కల్పించాలని వితంతువు నిరసన

సీతంపేట, ఆగస్టు 12: దొండపర్తికి చెందిన ఓ వితంతువు తన భర్త అక్కాచెల్లెళ్లు, బంధువుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన సోమవారం తెలిపారు. వివరాలివి.. దొండపర్తి వెంకటరాజునగర్‌కి చెందిన వెన్నల కృష్ణవేణి (30) భర్త అప్పారావు మృతి చెంది ఎనిమిది సంవత్సరాలైంది. అప్పటినుంచిభర్త అప్పారావు అక్కాచెల్లెళ్లు, మేనత్త బంధువులు గొడవకు వస్తున్నారని కృష్ణవేణి తెలిపారు. తనకు భర్తకు చెందిన ఆస్తిని ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. ఆస్తి విషయంలో కోర్టులో కేసు ఉన్నట్టు తెలిపింది. తమ వివాదంపై సీపీకి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ వెంకటరావు వద్ద ప్రస్తావించగా ఆమెను బెదిరింపులకు పాల్పడిన వారిని బైండోవర్ చేస్తున్నామని వివరించారు.

ఆర్థిక సంఘం ప్రాంతీయ సదస్సు ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రం పరిధిలోని 16వ ఆర్థిక సంఘం నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు సోమవారం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఐఐఎం క్యాంపస్‌లో ప్రారంభమైంది. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద పనగారియా అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు అంశాలపై చర్చించారు. సమావేశాలు మంగళవారం కూడా జరగనున్నాయి. ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలకలం రేపిన శిశువు విక్రయ వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

పడాల్సి వస్తుంది కాబట్టి కొన్నాళ్ల తర్వాత తీసుకువెళ్లేలా ఇరువర్గాలకు మధ్యవర్తులుగా ఉన్నవారు చెప్పారు. దీని ప్రకారం శిశువుకు ఐదు నెలలు రావడంతో ఆస్పత్రి డయాగ్నోస్టిక్ సెంటర్ టెక్నీషియన్‌తోపాటు ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆడశిశువు తల్లిదండ్రులను సంప్రతించారు. శిశువును విక్రయించేందుకు తల్లి తటపటాయించడంతో ఆమె ఆడపడుచుతోపాటు మరికొందరు కుటుంబసభ్యుల ద్వారా మధ్యవర్తులు ఒప్పించారు. దీంతో శనివారం రాత్రి బిడ్డను అప్పగించి, డబ్బులు తీసుకునేందుకు ఐదేళ్ల శిశువును తీసుకుని దంపతులు, ఆడపడచు, ఇద్దరు మధ్యవర్తులు మరో ఐదుగురు కుటుంబసభ్యులు సిరిపురం సమీపంలోని హార్బర్ పార్క్ వద్దకు చేరుకున్నారు. రూ.7.5 లక్షలకు శిశువును విక్రయించేందుకు ఒప్పందం కుదరడంతో చెక్ ద్వారా ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు కొనుగోలుదారులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో సీపీ హెల్ప్ లైన్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారిద్వారా డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. శిశువుతోపాటు తల్లిని మరో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. శిశువును తొలుత శిశుగృహకు తరలించారు. అయితే శిశువుకు వైద్యచికిత్స అవసరం కావడంతో అక్కడి నుంచి తల్లితోపాటు కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు శిశువు భర్త సహా తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రెండు చెక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో మరికొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉన్నందున వివరాలను బయటపెట్టడం లేదని త్రీటౌన్ సీఐ పార్థసారధి వివరించారు.

'సీనియర్లకు తగిన గుర్తింపునివ్వాలి



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, ఆగస్టు 12: తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలో వచ్చేందుకు విశాఖ పార్లమెంట్ పరిధిలో కృషి చేసిన సీనియర్ నేతలను గుర్తించి తగిన పదవులతో గౌరవం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అధిష్టానాన్ని కోరారు. సోమవారం నజీర్ ఉండవల్లిలో పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర, ఐటీ మానవ అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా నజీర్ పార్టీ పరంగా పలు అంశాలను వివరించారు.

కాలుష్య నియంత్రణపై కానరాని చిత్తశుద్ధి

... 5వ పేజీ తరువాయి

సరఫరా వంటి కార్యక్రమాలు చేపట్టింది. కాలుష్యం తగ్గింపునకు ఇచ్చిన నిధులను రాష్ట్ర ఖాతాలో కాకుండా పీఎఫ్ఎంఎస్‌లో జమ చేయాలని కేంద్రం చెప్పినా ఆ పని చేయలేదు. ఈ నేపథ్యంలో 2020-21 నుంచి 2022-23 వరకు రూ.129.25 కోట్లు విడుదల చేసిన కేంద్రం ఆ తరువాత నిధులు విడుదల నిలిపివేసింది. అయినా గత పాలకులుఅవేవి పట్టించుకోలేదు సరికదా...ఉన్న నిధులు ఖర్చు చేసేందుకు కూడా ప్రయత్నించలేదు. విశాఖతోపాటు ఇతర నగరాలు, పట్టణాలకు మంజూరైన నిధులవ్యయంలో వైసీపీ పాలకులు విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో 2019తో పోల్చితే విశాఖతోపాటు మిగిలిన నగరాలు, పట్టణాల్లో కాలుష్యం పెరుగుతూ వచ్చింది. దేశంలోని పలు నగరాల్లో క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌కు వందల కోట్లు కేంద్రం నుంచి తీసుకువచ్చి ఖర్చు చేయగా జగన్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో విఫలమైంది.

విశాఖ నగరం దేశంలో మిగిలిన నగరాలకు భిన్నమైనది. నగరం చుట్టూ కొండలు ఉండడం వల్ల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం ఇక్కడే ఉండిపోతుంది. కాలుష్యం తగ్గింపునకు చర్యలు తీసుకోనందున 2019 నుంచి గాలిలో ధూళి కణాలు క్రమేపీ పెరుగుతూ ఉన్నాయి. నగటున పీఎం-10 (సూక్ష్మ ధూళి కణాలు) 2019లో 97గా ఉండగా, 2020-21లో 104కు, 2021-22లో 98, 2022-23లో 116, 2023-24లో 120కు పెరిగాయి. వర్షాకాలంలో కూడా నగరంలో పీఎం-10 స్థాయి తగ్గలేదు. దేశంలో శనివారం అనేక నగరాల్లో గాలిలో ధూళిశాతం 'గుడ్, 'శాటిస్‌ఫెక్టరీ'గా ఉంటే విశాఖలో మాత్రం 'మోడరేట్'గా నమోదైంది. ఈ నెల ఒకటి నుంచి పదో తేదీ వరకు పీఎం-10 పరిశీలిస్తే సగటున 126 నుంచి 163 వరకూ నమోదైంది. నగరంలో లక్షల్లో వాహనాలు ఉండడం, భవన నిర్మాణాల సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, పోర్టు నుంచి బొగ్గు ధూళి, పరిసర పరిశ్రమల నుంచి ధూళి కణాలు వెలువడడంతో కాలుష్యం పెరిగిపోతోంది. నగరం మొత్తానికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ యంత్రం ఉంది. ఇక్కడ నమోదైన కాలుష్యం వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. నగరంలో మరికొన్నిచోట్ల యంత్రాలు ఏర్పాటుచేస్తే వాస్తవంగా కాలుష్య తీవ్రత ఎంత ఉందనేది తెలుస్తుందని పర్యావరణ నిపుణులు అంటున్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను జీవీఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం బదలాయించడంతోపాటు మరిన్ని నిధులు తీసుకురాగలిగితే నగరంలో కాలుష్యం నియంత్రణకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ మంత్రి పవన్‌కల్యాణ్ విశాఖలో కాలుష్యం తగ్గిస్తామని, ఇందుకు ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో మరిన్ని నిధులు తీసుకురాగలిగితే విశాఖతో పాటు రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో కాలుష్యాన్ని నియంత్రించ వచ్చునని అంటున్నారు.

సిక్ లీవులో మాజీ వీసీ ప్రసాదరెడ్డి

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వివరాలు బయటకు చెబుతున్నారని కంప్యూటర్ సైన్స్ విభాగంలో బోధనేతర సిబ్బందిని మూకుమ్మడిగా ఎస్-3 సెక్షన్‌కు అటాచ్‌మెంట్ చేశారు. వారు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే నింద మోపారు. అది అసలు కారణం కాదని, రోజూ పత్రికల్లో ప్రసాదరెడ్డిపై వార్తలు రావడానికి వారే కారణమని భావించి చర్యలు తీసుకున్నారని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. దాంతో ఉలిక్కిపడిన అధికారులు ఇతర అంశాలు కూడా జోడించి వాటన్నింటిపై విచారణకు ఐదుగురు సభ్యులతో సెలవు రోజైన ఆదివారం కమిటీని నియమించారు. సోమవారం ఉదయాన్నే ఆ కమిటీ సభ్యులు కంప్యూటర్ సైన్స్ విభాగానికి వెళ్లి కూర్చున్నారు. బోధన సిబ్బంది ఎవరు ఏ సమయానికి వస్తున్నారో నమోదు చేసుకున్నారు. రోజూ 11.30 గంటలు దాటిన తరువాత రావడం అలవాటు చేసుకున్న ప్రసాదరెడ్డి ఇప్పుడు కమిటీ విచారణ చేస్తున్నదని సరిగ్గా 9 గంటలకు వస్తే...తాను తలవంచినట్టు అవుతుందని భావించి, రెండు రోజులు సిక్ లీవు పెట్టేశారు. అంటే ఆయన ఏ సమయానికి వస్తున్నారో కమిటీ నమోదు చేయడానికి వీలుండదు. నివేదికలో ఆయన ప్రస్తావన ఉండదు.

సిక్ లీవు ఎలా ఇచ్చారు?

ఈ విభాగంలో ఎవరైనా సెలవు పెట్టాలంటే ముందుగా హెచ్ఓడీకి సమాచారం ఇవ్వాలి. ఫోన్ చేసి చెప్పాలి. వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలి. ఆ తరువాత లీవ్ లెటర్ పెట్టాలి. దానిని హెచ్ఓడీ నుంచి ఓఎస్‌డీకి పంపుతారు. ఇప్పుడు ప్రసాదరెడ్డి లీవుకు ఎప్పుడు దరఖాస్తు చేశారు? ఎప్పుడు మంజూరుచేశారో కూడా తెలియదు. ఆదివారం కమిటీ వేశారు. సోమవారం ఉదయానికి రిజిస్టర్‌లో ఆయన సిక్ లీవు అని రాసి ఉంది.

ఇంజనీరింగ్ కాలేజీ బాగోతాలు అన్ని ఉన్నాయా?

నెల రోజుల క్రితం వరకూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రస్తుత ఇన్‌చార్జి వీసీయే పనిచేశారు. ఇప్పుడు ఒక్కసారిగా ఆ కాలేజీ పరిధిలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో లెక్కలేనంత అవినీతి జరిగిపోతున్నదని ఫిర్యాదులు వచ్చాయంటూ కమిటీని వేశారు. ఆ ఫిర్యాదులు ఎప్పుడు వచ్చాయి?, ఇంతవరకూ ఎందుకు ఉపేక్షించారు?, ఆయన ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు ఎందుకు ఇలాంటి వాటిని నిరోధించలేకపోయారు?...అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల రోజుల్లోనే విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసే ప్రక్రియ ప్రారంభమైందా?, ఇంతకు ముందు లేదా? అప్పుడు ఏమి చేశారో?...అందరికీ అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉంది. అందరి బాగోతాలు బయటపెట్టాలంటే...సిబ్బంది హాజరుకు బయోమెట్రిక్ అమలు చేయాలి. అనేక చిన్న విద్యా సంస్థల్లో ఈ విధానం ఎప్పటి నుంచో ఉంది.

ఏయూ జోరు

... 5వ పేజీ తరువాయి

రాష్ట్రాల నుంచి ఉస్మానియా ఆరో స్థానంలో ఉంది.

ర్యాంకు కేటాయింపు ఎలా..?

ఈ ర్యాంకులు కేటాయించడానికి ముందు ఎన్ఐఆర్ఎఫ్ వర్సిటీలోని అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. విద్యార్థుల సంఖ్య, ఫ్యాకల్టీ అండ్ విద్యార్థుల రేషియో, పీహెచ్‌డీ చేసే విద్యార్థుల సంఖ్య, పరిశోధనలు, పబ్లికేషన్స్, ఆర్థిక వనరులు, వినియోగం, క్వాలిటీ ఆఫ్ పబ్లికేషన్స్ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సంస్థ ర్యాంకులను కేటాయిస్తుంది. ఏయూ మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అన్ని విభాగాల్లో టాప్‌లో నిలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు.

మెరుగుపడిన ఐఐఎం ర్యాంకు..

తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఐఐఎం విశాఖపట్నం కూడా మెరుగైన ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ కేటగిరీ జాబితాలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విశాఖపట్నం 59.20 స్కోరుతో 26వ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది 29వ స్థానంలో నిలిచిన ఐఐఎంవీ మూడు స్థానాలను మెరుగుపరుచుకుంది. గడిచిన కొన్నాళ్లుగా ర్యాంకును మెరుగుపర్చుకుంటూ వస్తోంది. 2022లో 33వ స్థానాన్ని సాధించగా, గత ఏడాది 29, ఈ ఏడాది 26వ స్థానాన్ని దక్కించుకుంది. మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఫ్యాకల్టీ, సిబ్బంది కృషితోనే మెరుగైన ర్యాంకు సాధ్యమైందన్నారు.

భీమిలి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన వివరణలో పొంతన లేకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే ఆ పార్టీలకు మేలు చేయాలని పెండింగ్‌లో పెట్టారని భావించి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ధర్మాన బంధువు తులసీదాస్

సస్పెండైన తులసీదాస్ శ్రీకాకుళం జిల్లా వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు బంధువు. విజయవాడలోని ఐజీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి సీనియర్ అసిస్టెంట్ అయ్యారు. ఆ తరువాత గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొంది నక్కపల్లిలో పనిచేశారు. అక్కడ అనేక ఆరోపణలు వచ్చాయి. అక్కడి నుంచి సొంత జిల్లా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వెళ్లారు. అక్కడి నుంచి 2022లో మంత్రి ధర్మాన సాయంతో భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. దీనికి ముందు కొన్నాళ్లు ఆయన ధర్మాన వద్ద పీఏగా కూడా పనిచేశారు. భీమిలిలో రిజిస్ట్రార్ మన మనిషే కాబట్టి ఏమైనా చేసుకోవచ్చుననే ఆలోచనతో వైసీపీ నాయకులు ఈ ఇనాము భూములు కొట్టేయడానికి యత్నించారని తెలుస్తోంది.



శివ లింగాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

శివయ్యకు ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 12: జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో ఉన్న విశ్వేశ్వరాలయంలో శ్రావణ అష్టమిని పురస్కరించుకుని సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకులు వ్యాగ్యేశ్వరరావు శర్మ పర్యవేక్షణలో స్వామివారికి పంచదార, పాలు, పెరుగు, పండ్ల రసాలు, పండ్లు, విభూది, చందనం, పసుపు కుంకుమలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం స్వామివారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ లింగాల తిరుగుడు ఆలయంలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి కర్ణవానిపాలెంలో గల స్వయంభూ లింగాల తిరుగుడు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించగా పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

15న రక్తదాన శిబిరం

పెందుర్తి, ఆగస్టు 12: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న పెందుర్తిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించనున్న ఈ శిబిరం ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల రక్తదాతలు 8639999343 సెల్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు.



చంద్రబాబుకు చిత్రపటాన్ని అందజేస్తున్న విజయ్‌కుమార్

మిల్లెట్స్‌తో చంద్రబాబు చిత్రపటం

విశాఖపట్నం, ఆగస్టు 12: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ మిల్లెట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని తయారు చేశారు. ఈమేరకు సోమవారం ఆయన అమరావతిలో సీఎంను కలిసి చిత్రపటాన్ని బహూకరించారు. కేవలం మిల్లెట్స్ (చిరుధాన్యాలు) ఉపయోగించి, ఎలాంటి రంగులు వాడకుండా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. విజయ్‌కుమార్ తీర్చిదిద్దిన మిల్లెట్ చిత్రాన్ని స్వయంగా వీక్షించిన చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్ చిత్రకళా ప్రతిభను ప్రశంసించారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 38, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 55, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)8, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 46, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 86, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 70
ఫారం ధర	-- 90
విత్ స్కిన్	-- 150
స్కిన్‌లెస్	-- 160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు వేసిన శిలాఫలకం



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో ఉన్న పార్కు స్థలం

2020-పార్కుపై శీతకన్ను

అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు

పెదగంట్యాడ, ఆగస్టు 12: జీవీఎంసీ 75వ వార్డులోని పెద కోరాడ, పాత అయ్యన్నపాలెం నిర్వాసిత కాలనీలకు చెందిన 2020-పార్కు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు ఈ పార్కుపై శీతకన్ను వేయడంతో ఇది దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కును అందంగా తీర్చిదిద్దితే ఆయా కాలనీల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కాగా ఈ పార్కులో రూ.20 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు 2020 ఫిబ్రవరి రెండున అప్పటి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వాకింగ్ ట్రాక్‌కు అప్రోచ్ మాత్రమే ఏర్పాటు చేసి వదిలేశారు. వాకింగ్‌ట్రాక్ మట్టితో ఉండటంతో ఇందులో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఏ మాత్రం వర్షం కురిసినా ఈ ట్రాక్‌లో నీరు నిలిచిపోయి బురదమయంగా ఉంటుంది. పార్కులో సేదతీరేందుకు వీలుగా చెంచీలు, బల్లలు వంటివేవీ లేవు. పార్కును పచ్చదనంతో నింపుతామని, అందమైన పూల మొక్కలు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా వివిధ రకాల క్రీడా పరికరాలను ఏర్పాటు చేస్తామని గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఇసుక డిపోలోని రికార్డుల పరిశీలన

అగనంపూడి, ఆగస్టు 12: ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. స్థానికంగా గల ప్రభుత్వ ఇసుక డిపోను సోమవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో డిపోలో ఇసుక నిల్వలు, విక్రయాలు, రవాణా స్థితిగతులను ఆయన పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రజలకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఇసుక నిల్వలు, ఇప్పటివరకు ఎంతమేరకు సరఫరా చేశారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేయడంతో పాటు ఇసుక కోసం వచ్చిన పలువురు కొనుగోలుదారులతో హరేంధిర ప్రసాద్ మాట్లాడారు. ఇసుక రవాణా, ధరలు, విక్రయ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది సహకారాన్ని అందిస్తున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, మైన్స్ విభాగం అధికారులు ఉన్నారు.



ఇసుక డిపోలోని రికార్డులను పరిశీలిస్తూ, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రామకృష్ణాపురంలో కలుషితమైన భూగర్భ జలాలు

చమురు వాసన వస్తోందని గగ్గోలు పెడుతున్న ప్రజలు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

మల్కాపురం, ఆగస్టు 12: జీవీఎంసీ 61వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో భూగర్భ జలాలు కలుషితమవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలోని బోర్ల నుంచి వస్తున్న నీరు దుర్వాసనతో ఉంటోంది. కొన్నేళ్లుగా ఇదే దుస్థితి నెలకొన్నా అధికారులు కానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం లక్షల రూపాయలు వెచ్చించి తవ్వించుకున్న బోర్ల నుంచి వస్తున్న నీరు వినియోగానికి ఏ మాత్రం పనికిరావడం లేదని వాపోతున్నారు. దీంతో రామకృష్ణాపురం వాసుల్లో అత్యధిక శాతం మంది భూగర్భ జలాలను వినియోగించడం మానేశారు. ప్రస్తుతం జీవీఎంసీ సరఫారా చేస్తున్న తాగునీటిపైనే ఆధారపడుతున్నామని పలువురు చెబుతున్నారు. తమ ప్రాంతానికి గ్రామానికి ఎదురుగా హెచ్‌పీసీఎల్ ఉండడంతో చమురు ఛాయలు భూగర్భంలోకి చొచ్చుకు వస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇప్పుడున్న హెచ్‌పీసీఎల్ అడ్మిన్ బిల్డింగ్‌తో పాటు ఇతర భవనాలు ప్రదేశంలో ఒకప్పుడు చమురు నిల్వకు సంబంధించిన పెద్దపెద్ద ట్యాంక్‌లు ఉండేవి. సంస్థ విస్తరణ సమయంలో కొన్ని ట్యాంక్‌లను పూర్తిగా తొలగించారు. ఆ సమయంలో ఆయా ట్యాంక్‌ల్లో ఉన్న చమురు భూమిలోకి ఇంకిపోయి రామకృష్ణాపురం వైపు వచ్చి ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏ బోరు నుంచి నీరు తీసినా చమురు వాసన వస్తోందని గగ్గోలు పెడుతున్నారు. దీంతో తాగునీటికి, ఇతర అవసరాలకు జీవీఎంసీ కొళాయిలపైనే ఆధారపడుతున్నామని చెబుతున్నారు. ఎప్పుడైనా కొళాయిల నుంచి నీటి సరఫరా ఆగిపోతే తాము నానాపాట్లు పడుతున్నామని పేర్కొంటున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు కల్పించుకుని భూగర్భ జలాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపి తమ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి వాసన చూస్తున్న స్థానికుడు

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య సేవలందిస్తాం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి వెంకట శేషమ్మ

గోపాలపట్నం, ఆగస్టు 12: ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణం వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడతామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి వెంకటశేషమ్మ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పర్యవేక్షణ, వారి హక్కులను వివరించారు. అనంతరం భవిత కేంద్రం సిబ్బందితో మాట్లాడి పిల్లలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ గీత, పాఠశాల హెచ్‌ఎం ఎం.మోహనరావు, ఐఈటీఆర్ అధ్యాపకులు ధనలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ



వయనాడ్‌కు పయనమైన వాహనాలకు జెండా ఊపుతున్న తలశిల బలరామకృష్ణ

వయనాడ్ బాధితులకు వైజాగ్ ప్రొఫైల్స్, 'సింహాద్రి' చేయూత

ఆటోనగర్, ఆగస్టు 12: ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని టీఎస్సార్ టీటీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. శ్రీనగర్‌లోని టీఎస్సార్ టీటీకే కళాశాలలో సోమవారం వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్-సింహాద్రి టీఎంటీ, ఒడిశా స్టీవ్ డోర్స్, హిమ హ్యూమానిటేరియన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు లక్ష రూపాయల విలువైన నిత్యావసర సరకులు, దుస్తులు, పండ్లు, తదితర సామగ్రితో కూడిన వాహనాలు బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి అందరూ చేయూతను అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు మాట్లాడుతూ వయనాడ్‌లో అంతులేని విషాదం నెలకొందని, బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతిని శాసించే స్థాయికి మనుషులు రావడం వల్లే వయనాడ్ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. హిమ హ్యూమానిటేరియన్ సంస్థ సభ్యుడు టీవీడీ దాస్ మట్లాడుతూ ఆపదలో ఉన్నవాళ్లను ఆదుకోవడం మానవ ధర్మమన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ డాక్టర్ ప్రొఫెసర్ బొంగు శ్రీనివాసరావు, ఘోషాస్పత్రి హెడ్ నర్స్ కుప్పిలి మణి, టీడీపీ నాయకులు పి.సంతోష్, జీవీ హరి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

గోపాలపట్నం, ఆగస్టు 12: బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలవ్వడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇక్కడి సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద ఓ వ్యక్తి బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా నగరం నుంచి ఎస్.కోట వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న ఆ వ్యక్తిని 108 వాహనంలో పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన వ్యక్తి

షిప్‌యార్డు క్రేన్ ప్రమాదంపై మళ్లీ విచారణ?

మల్కాపురం, ఆగస్టు 12: షిప్‌యార్డులో నాలుగేళ్ల క్రితం జరిగిన క్రేన్ ప్రమాదంపై పోలీసు అధికారులు మళ్లీ విచారణ చేస్తునట్టు తెలిసింది. అప్పట్లో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందారు. అప్పట్లో ఈ కేసును నాటి ఏసీపీ శ్రావణ్‌కుమార్ దర్యాప్తు చేసి చార్జిషీట్ కూడా వేశారు. అయితే చార్జిషీట్‌లో ప్రస్తుత సీఎండీ హేమంత్ ఖత్రీ, ఓ మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రమాదానికి బాధ్యులను చేస్తూ కేసు నమోదు చేశారు. ఈ కేసు కొనసాగుతుండగా.. ఇటీవల సీపీగా బాధ్యతలు చేపట్టిన శంఖబత్ర బాగ్చిని షిప్‌యార్డు సీఎండీతో పాటు డైరెక్టర్ కలిసి క్రేన్ ప్రమాదం తమ వల్ల జరగలేదని, అయినప్పటికీ చార్జిషీట్‌లో తమ పేర్లను చేర్చారని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో సీపీ వీరిద్దరి స్టేట్‌మెంట్లను రికార్డు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఈ మేరకు వీరిద్దరి స్టేట్‌మెంట్‌ను మల్కాపురం సీఐ విద్యాసాగర్ తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

శిశువుల మృతదేహాల లభ్యంపై చురుగ్గా దర్యాప్తు

మల్కాపురం, ఆగస్టు 12: ఇటీవల శ్రీహరిపురం పరిసర ప్రాంతాల్లో నవజాత శిశువుల మృతదేహల లభ్యంపై మల్కాపురం పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. గతనెల 18న శ్రీహరిపురం కారాడవీధిలోని ఓ కాలువలో ఓ నవజాత శిశువు మృతదేహం, ఈ నెల 11న రామ్‌నగర్ గెడ్డలో మరో నవజాత శిశువు మృతదేహం లభించడం పట్ల పోలీసులు విచారణ సాగిస్తున్నారు. రోజుల వ్యవధిలోనే రెండు మృతదేహాలు లభ్యమవ్వడంతో వీటిని ఎవరు పడేస్తున్నారన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో ఎవరెవరు వైద్యులు, నర్సులు, ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది ఉంటున్నారో ఆరా తీస్తున్నారు. నర్సింగ్ హోమ్‌ల్లో ఎలాంటి చికిత్సలు జరుగుతున్నానకే అంశాలపై లోతుగా దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆస్పత్రుల్లో ఎవరికైనా ఇటీవల ప్రసవాలు జరిగియా అని తెలుసుకుంటున్నారు. గతంలో ఇలాగే ఓ నర్సు మల్కాపురం శ్మశానవాటికలో ఓ పసికందును పడేసి వెళ్లిపోయింది. ఈ కేసులో చిన్న క్లూతో ఆమెను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇప్పుడు కూడా అలాంటి దుశ్చర్యలకు ఎవరైనా వ్యవహరిస్తున్నారా? అని ఆరా తీస్తున్నారు.

ఘనంగా పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం, ఆగస్టు 12: మల్కాపురం ఎస్సీ కాలనీలోని పోలమాబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 30 ఏళ్లయిన సందర్భంగా రామ్-రాంజీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో విచ్చేసి పోలమాంబను దర్శించుకున్నారు.





ఆర్డీవో జయప్రకాశ్, తదితరులకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

రక్షా బంధన్ వారోత్సవాలు ప్రారంభం

అగనంపూడి, ఆగస్టు 12: ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రక్షా బంధన్ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ బీకే సోమేశ్వరి రాఖీలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు రాఖీలు కట్టారు. ఇక్కడి ఆర్డీవో కార్యాలయంలోని ఆర్డీవో జయప్రకాశ్, ఏవో మోహన్‌కృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ భారతి, ఎస్‌బీస్ మేనేజర్ కేకే రావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకరబాబు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. వారం రోజుల పాటు రాఖీ వారోత్సవాలను నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే రామకోటి, బి.సత్యనారాయణ, అరుణ, రాధ, రాజు, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్



దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, ఉక్కు ఉద్యోగులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 12: స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసేలా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,278వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాన్ని కూటమి నాయకులు ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారో.. అలాగే ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మరో చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు నడుం బిగించాలని, కేంద్ర ఉక్కు శాఖా మంత్రి ఇచ్చిన హామీల పరిష్కారానికి యత్నించాలన్నారు. ప్లాంటును ప్రైవేటీకరిస్తే ఆర్-కార్డులు ఉన్నవారి భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు రక్షణకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. నాయకుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ముంచేలా కేంద్ర విధానాలు ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సుబ్బయ్య, అవతారం, ధనుంజయ సాహు, వేణువర్మ, గంగవరం గోపి, పలువురు ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్రం తక్షణమే ఆదుకోవాలి

ఉక్కుటౌన్‌షిప్: ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లగా ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళనలు చేస్తున్నా కర్మాగారం నష్టపోయేలా చర్యలు చేపడుతుండడం దారుణమన్నారు. ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్పీ నాయుడు, బీఎస్ రాజు, పీవీ రమణమూర్తి, రాథోడ్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ అర్జీలు స్వీకరించిన పంచకర్ల

పెందుర్తి, ఆగస్టు 12: మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన సోమవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అర్జీలు స్వీకరించారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి పలువురి నుంచి ఆయన వినతులు తీసుకున్నారు. వాటిని శాఖల వారీగా విభజించి శాఖాపరంగా విభజన చేసి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని వినతి

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో కాపులకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మంగళగిరిలో కలిసి జిల్లా కాపు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం విజయం కోసం కాపులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు నగిశెట్టి గంగబాబు, ప్రతినిధులు కరణం నరసింగరావు, రామకోటేశ్వరరావు, వెలంకాయల శ్రీను, కరణం నగష్, స్వాతి, ఎస్.అప్పారావు, తదితరులు ఉన్నారు.

అన్న క్యాంటీన్లలో సదుపాయాలు కల్పించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఎన్.ఎ.డి. జంక్షన్, ఆగస్టు 12: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్న క్యాంటీన్లలో ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సూచించారు. 90వ వార్డు పరిధి బాజీ జంక్షన్‌లోని అన్న క్యాంటీన్‌ను సోమవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని వివరించారు. క్యాంటీన్ చుట్టూ కమిషనర్ తిరిగి డ్రైనేజీ, లైటింగ్, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జోన్-8 జెడ్సీ హైమావతి, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ విజయకుమార్, ఏఈ వెంకటలక్ష్మి, ఏపీడీ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్ వద్ద కమిషనర్ సంపత్‌కుమార్, తదితరులు

ప్రారంభానికి ముందే చోరీ..

ఈ నెల 15 ప్రారంభించాల్సిన అన్న క్యాంటీన్ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇందులో నూతనంగా ఏర్పాటు చేసి వాటర్ ప్యూరిఫైయర్, వాష్ ట్యాప్‌లతో పాటు ఇతర పరికరాలను దొంగలు అపహరించారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని అంచనా. ఈ చోరీ గురించి ఉన్నతాధికారులకు వివరించి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్థానిక అధికారులు సిద్ధపడుతున్నట్టు తెలిసింది.

ఎస్ఆర్ రంగనాథన్‌కు నివాళి

పెందుర్తి, ఆగస్టు 12: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని సోమవారం లైబ్రేరియన్ బి.సూర్యకళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సామాజిక సేవకుడు బేత రామం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చీపురుపల్లి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మోడలింగ్ పోటీల్లో తన్వీరిషిక ప్రతిభ



పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన తన్వీరిషిక

మహారాణిపేట, ఆగస్టు 12: థాయ్‌లాండ్‌లో జరిగిన మోడలింగ్ పోటీల్లో నగరానికి చెందిన తన్వీరిషిక ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. అక్కడ ఇటీవల జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలకుతన్వీ రిషిక పాల్గొని ద్వితీయ స్థానం ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ తల్లిదండ్రులు రేణుక, సురేశ్ మాట్లాడుతూ ఫ్యాషన్ రంగంలో కుమార్తె ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. గతంలో విశాఖలో నిర్వహించిన ఆంధ్ర ఫ్యాషన్ పోటీల విజేతగా నిలిచినట్టు చెప్పారు.

'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 12: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నిషా ముక్త్ అభియాన్ 5వ వార్షికోత్సవం ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని డీఈవో ఆదేశించినట్టు సందర్భంగా ప్రధానోపాధ్యాయి లక్ష్మీనరస తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథ్, పీడీ ఎ.సునంద్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పూజలు



అమ్మవారు

పూర్ణామార్కెట్, ఆగస్టు 12: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు సోమవారం శ్రావణలక్ష్మిగా పూజలందుకున్నారు. అలాగే, అమ్మవారికి కుంకుమపూజలను ఉభయదాతలతో అర్చకులు చేయించారు. శ్రావణలక్ష్మి అలంకరణలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఇబ్బందులేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

రైల్వే పార్కు ఆక్రమణ

గేదెలు, ఆవులు పెంపకం.. అసాంఘిక కార్యకలాపాలతో అవస్థలు



తాటిచెట్లపాలెం వద్ద రైల్వే పార్కులో ఆవులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 12: రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో విలువైన రైల్వే పార్కును ప్రైవేటు వ్యక్తులు వారి అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. తాటిచెట్లపాలెం 80 అడుగుల రోడ్డు సమీపంలో రైల్వే క్వార్టర్స్ నంబర్ 835 పక్కన గల సిబ్బంది సేద తీరేందుకు ఈ ఉద్యానవనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. కొంత కాలంపాటుఇక్కడ రైల్వే క్వార్టర్లలో ఉన్న కుటుంబాల వారు సాయంత్రం వేళల్లో ఈ పార్కుకు వచ్చి సేద తీరేవారు. అయితే, కొన్నాళ్లుగా ఇక్కడ కొంతమంది స్థానికులు పార్కు స్థలాన్ని ఆక్రమించి గేదెలు, ఆవులను మేపుతున్నారు. అలాగే, భవన నిర్మాణ సామగ్రిని వేస్తున్నారు. దీంతో ఆ స్థలంలో చెత్తా చెదారంతో నిండి డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీనికితోడు ఆ పార్కు స్థలంలో కొందరు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పార్కులోని మొక్కలను కూడా తొలగించడంతో కళావిహీనంగా మారింది. ఈ రైల్వే పార్కులోకి ప్రైవేట్ వ్యక్తులు రైల్వే క్వార్టర్స్ సిబ్బందిని అనుమతించడం లేదు. ఇకనైనా రైల్వే అధికారులు స్పందించి ఆ పార్కును స్వాధీనం చేసుకుని మరమ్మతులు చేసి అం దుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

'జెండా ఉంచా రహే హమారా' రేపు

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: దేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14న 'జెండా ఉంచా రహే హమారా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు ఆర్.బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకలకు ముందురోజు ఎల్‌ఐసీ సమీపంలోని ప్రభుత్వ మహిళా కళాశాల సిటీ సెంట్రల్ పార్కు వేదికగా వేలాదిమంది విద్యార్థులతో జాతీయ జెండా ఆవిష్కరిస్తామన్నారు. 25 వేల చదరపు అడుగుల త్రివర్ణపతాకంతో నిర్వహించనున్న ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ప్రదీప్‌రాజు, నరేష్, కుమార్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ

మహారాణిపేట, ఆగస్టు 12: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనమండలి సభ్యుడు వి. చిరంజీవిరావు అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం 22 సంఘాలతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. పలు సమస్యలను విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. గతంలో హామీ ఇచ్చినట్టు 117 జీవోను రద్దు చేస్తారన్నారు. వర్కు అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ ఈనెల 16వ తేదీనుంచీ ప్రారంభం కానుందన్నారు. మెరిట్ రోస్టర్ విధానానికి అనుగుణంగా సినియారిటీ నిర్ణయిస్తామన్నారు.ప్రతీ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండేలా చూడాలన్న అభ్యర్థనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. ఏ పాఠశాలా మూతపడే పరిస్థితిఉండదని అన్నారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి: ఎస్‌ఐ

సీతంపేట, ఆగస్టు 12: వసతి గృహాల్లో తప్పనిసరిగ్గా సీసీ కెమెరాలుఉండాలని క్రైమ్ ఎస్‌ఐ రవి పేర్కొన్నారు. రామాటాకీస్ రోడ్డులోని మహిళ హస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులకు చోరీలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనుమానితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలు విజేతలు వీరే..



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 12: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-13 బాలుర, బాలికల చదరంగం పోటీలు సోమవారం ముగిశాయి. లయన్స్ క్లబ్‌లో జరిగిన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా 135 మంది చిన్నారులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించా రు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో తనీష్, వంశీ..బాలికల విభాగంలో గొర్లె నైన, లహరి తొలి రెండు స్థానాలలో విజేతలుగా నిలిచారు. ఈ నలుగురు చిన్నారులు త్వరలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్యాల కోటేశ్వరరావు, కార్యదర్శి పలిశెట్టి లక్ష్మన్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబురావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బలివాడ సత్యారావు, బోయిన బాబురావు, చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు పాల్గొన్నారు.

15న ఉచిత వైద్య శిబిరం

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెంలోని రామచంద్రానగర్ నాల్గో లైన్‌లో ఈ నెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ శిబిరానికి వైద్యులు వి.మన్మధరావు, ఆనందకుమారి, శ్రీనివాసా ల్యాబ్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలతోపాటు అవసరమైన మందులు అందజేయనున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే 'కూన'ను కలిసిన 'సనపల'



కూన రవికుమార్‌ను సత్కరిస్తున్న వరప్రసాద్

మాధవధార, ఆగస్టు 12: ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్‌ను శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో టీడీపీ విశాఖపార్లమెంట్ అధికార ప్రతినిధి, 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించి సాయిబాబా జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గత 35 ఏళ్లనుంచి టీడీపీ పటిష్టత కోసం పాటు పడుతున్నామని, రానున్న నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని వరప్రసాద్ కోరారు. మురళీనగర్ ప్రాంతంలో జంట గ్రామాల భూములను నిషేధిత భూముల జాబితా (22ఎ)లో చేర్చడంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వివరించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో దొరికిన ఫోన్ అందిస్తున్న డ్రైవర్

అక్కయ్యపాలెం, ఆగస్టు 12 : దొరికిన ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌ను ఆటో డ్రైవర్ ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో సోమవారం తిరిగి బాధితుడికి అప్పగించారు.వివరాలిలా ఉన్నాయి. పాడేరుకు చెందిన సతీశ్ ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ వైపువెళుతుండగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. ఈ సెల్‌ఫోన్ ఆటో డ్రైవర్ పైడిరాజు దొరికింది. ఆయన తన తోటి ఆటో డ్రైవర్లతో కలిసి ఈ విషయం పోలీసులకు తెలిపారు.నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్సై వి. వాణిశ్రీ, ఏస్సై రమణ సమక్షంలో ఈ సెల్‌ఫోన్‌ను బాధితుడు సతీశ్‌కు సోమవారం అప్పగించారు. పోలీసులు ఆటో డ్రైవర్ పైడిరాజు నిజాయితీని అభినందించారు.

ఇరువర్గాల మధ్య తగాదా

కంచరపాలెం, ఆగస్టు 12: ఊర్వశి జంక్షన్ సమీపాన నలందనగర్‌లో ఇరువర్గాల మధ్య సోమవారం రాత్రి వివాదం నెలకొంది. నలందనగర్‌లో ఏడుగురు యజమానుల పేరుతో 99 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. దీనిలో కొంత భాగంగా వినాయక, దుర్గాదేవి ప్రతిమలు తయారు చేసే రాజస్థాన్‌కు చెందిన కళాకారులకు యజమానులు అద్దెకు ఇచ్చారు. బొమ్మలు తయారు చేసే వారి కుటుంబాల్లో గొడవలు నేపథ్యంలో ఇటీవల వారిని ఇక్కడ నుంచి సంబంధిత యజమానులు ఖాళీ చేయించారు. అయితే, బొమ్మలు అమ్మే వ్యక్తి తమకు డబ్బు ఇవ్వాలంటూ ఆ స్థలంలోకి కొంత మంది వ్యక్తులు సోమవారం ప్రవేశించి ఆక్రమణకు యత్నం చేశారు. దీంతో స్థలానికి చెందిన యజమానులు 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కంచరపాలెం పోలీసులు వచ్చి ఇరువర్గాలను పంపించేశారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వాంబే కాలనీలో శిథిల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే తన లక్ష్యమని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని కనకలదిబ్బ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవనానికి సమీపాన ఉన్న వాంబే కాలనీ ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ఈ సమస్యను వారు సోమవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే ఆయన స్పందించి అక్కడికి వెళ్లి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న భవనానికి ఆనుకుని ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించిన తర్వాత పనులు కొనసాగించాలని అధికారులను కోరారు.వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

20ఏ బస్సు పునరుద్ధరించాలి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రం అందచేస్తున్న ప్రకాశరావు

సీతమ్మధార, ఆగస్టు 12: సీతమ్మధార, హెచ్‌బీ కాలనీలకు 20 ఏ సిటీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలని కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి సామాజిక కార్యకర్త నరవ ప్రకాశరావు వినతి పత్రం సమర్పించారు. 1983 నుంచి 20ఏ బస్సు హెచ్‌బీ కాలనీ నుంచి పాత పోస్టాఫీస్ నడిచేదని, దీనిని కొన్నాళ్ల కిందట నిలిపివేశారన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలు ఆశ్రయించడం వల్ల అధికంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'మైనారిటీల హక్కుల పరిరక్షణే ధ్యేయం'



మహ్మద్‌గౌస్‌కు నియామక పత్రమిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు

డాబాగార్డెన్స్, ఆగస్టు 12: విశాఖ జిల్లా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన సంఘ సేవకుడు మహ్మద్‌గౌస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ ఫారుఖ్‌షుబ్లీ విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఫారూఖ్ మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. మహ్మద్‌గౌస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కేటాయించడంపై జిల్లా అధ్యక్షులు అస్‌లమ్‌ఖాన్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

రక్షణ కల్పించాలని వితంతువు నిరసన

సీతంపేట, ఆగస్టు 12: దొండపర్తికి చెందిన ఓ వితంతువు తన భర్త అక్కాచెల్లెళ్లు, బంధువుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట నిరసన సోమవారం తెలిపారు. వివరాలివి.. దొండపర్తి వెంకటరాజునగర్‌కి చెందిన వెన్నల కృష్ణవేణి (30) భర్త అప్పారావు మృతి చెంది ఎనిమిది సంవత్సరాలైంది. అప్పటినుంచిభర్త అప్పారావు అక్కాచెల్లెళ్లు, మేనత్త బంధువులు గొడవకు వస్తున్నారని కృష్ణవేణి తెలిపారు. తనకు భర్తకు చెందిన ఆస్తిని ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. ఆస్తి విషయంలో కోర్టులో కేసు ఉన్నట్టు తెలిపింది. తమ వివాదంపై సీపీకి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. దీనిపై ఎస్‌ఐ వెంకటరావు వద్ద ప్రస్తావించగా ఆమెను బెదిరింపులకు పాల్పడిన వారిని బైండోవర్ చేస్తున్నామని వివరించారు.

ఆర్థిక సంఘం ప్రాంతీయ సదస్సు ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రం పరిధిలోని 16వ ఆర్థిక సంఘం నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు సోమవారం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఐఐఎం క్యాంపస్‌లో ప్రారంభమైంది. 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద పనగారియా అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు అంశాలపై చర్చించారు. సమావేశాలు మంగళవారం కూడా జరగనున్నాయి. ఈ సదస్సులో కేంద్ర, రాష్ట్ర ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలకలం రేపిన శిశువు విక్రయ వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

పడాల్సి వస్తుంది కాబట్టి కొన్నాళ్ల తర్వాత తీసుకువెళ్లేలా ఇరువర్గాలకు మధ్యవర్తులుగా ఉన్నవారు చెప్పారు. దీని ప్రకారం శిశువుకు ఐదు నెలలు రావడంతో ఆస్పత్రి డయాగ్నోస్టిక్ సెంటర్ టెక్నీషియన్‌తోపాటు ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆడశిశువు తల్లిదండ్రులను సంప్రతించారు. శిశువును విక్రయించేందుకు తల్లి తటపటాయించడంతో ఆమె ఆడపడుచుతోపాటు మరికొందరు కుటుంబసభ్యుల ద్వారా మధ్యవర్తులు ఒప్పించారు. దీంతో శనివారం రాత్రి బిడ్డను అప్పగించి, డబ్బులు తీసుకునేందుకు ఐదేళ్ల శిశువును తీసుకుని దంపతులు, ఆడపడచు, ఇద్దరు మధ్యవర్తులు మరో ఐదుగురు కుటుంబసభ్యులు సిరిపురం సమీపంలోని హార్బర్ పార్క్ వద్దకు చేరుకున్నారు. రూ.7.5 లక్షలకు శిశువును విక్రయించేందుకు ఒప్పందం కుదరడంతో చెక్ ద్వారా ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు కొనుగోలుదారులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో సీపీ హెల్ప్ లైన్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారిద్వారా డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. శిశువుతోపాటు తల్లిని మరో తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. శిశువును తొలుత శిశుగృహకు తరలించారు. అయితే శిశువుకు వైద్యచికిత్స అవసరం కావడంతో అక్కడి నుంచి తల్లితోపాటు కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు శిశువు భర్త సహా తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రెండు చెక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో మరికొందరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉన్నందున వివరాలను బయటపెట్టడం లేదని త్రీటౌన్ సీఐ పార్థసారధి వివరించారు.

'సీనియర్లకు తగిన గుర్తింపునివ్వాలి



మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, ఆగస్టు 12: తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలో వచ్చేందుకు విశాఖ పార్లమెంట్ పరిధిలో కృషి చేసిన సీనియర్ నేతలను గుర్తించి తగిన పదవులతో గౌరవం కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అధిష్టానాన్ని కోరారు. సోమవారం నజీర్ ఉండవల్లిలో పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర, ఐటీ మానవ అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా నజీర్ పార్టీ పరంగా పలు అంశాలను వివరించారు.

కాలుష్య నియంత్రణపై కానరాని చిత్తశుద్ధి

... 5వ పేజీ తరువాయి

సరఫరా వంటి కార్యక్రమాలు చేపట్టింది. కాలుష్యం తగ్గింపునకు ఇచ్చిన నిధులను రాష్ట్ర ఖాతాలో కాకుండా పీఎఫ్ఎంఎస్‌లో జమ చేయాలని కేంద్రం చెప్పినా ఆ పని చేయలేదు. ఈ నేపథ్యంలో 2020-21 నుంచి 2022-23 వరకు రూ.129.25 కోట్లు విడుదల చేసిన కేంద్రం ఆ తరువాత నిధులు విడుదల నిలిపివేసింది. అయినా గత పాలకులుఅవేవి పట్టించుకోలేదు సరికదా...ఉన్న నిధులు ఖర్చు చేసేందుకు కూడా ప్రయత్నించలేదు. విశాఖతోపాటు ఇతర నగరాలు, పట్టణాలకు మంజూరైన నిధులవ్యయంలో వైసీపీ పాలకులు విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో 2019తో పోల్చితే విశాఖతోపాటు మిగిలిన నగరాలు, పట్టణాల్లో కాలుష్యం పెరుగుతూ వచ్చింది. దేశంలోని పలు నగరాల్లో క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌కు వందల కోట్లు కేంద్రం నుంచి తీసుకువచ్చి ఖర్చు చేయగా జగన్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో విఫలమైంది.

విశాఖ నగరం దేశంలో మిగిలిన నగరాలకు భిన్నమైనది. నగరం చుట్టూ కొండలు ఉండడం వల్ల పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం ఇక్కడే ఉండిపోతుంది. కాలుష్యం తగ్గింపునకు చర్యలు తీసుకోనందున 2019 నుంచి గాలిలో ధూళి కణాలు క్రమేపీ పెరుగుతూ ఉన్నాయి. సగటున పీఎం-10 (సూక్ష్మ ధూళి కణాలు) 2019లో 97గా ఉండగా, 2020-21లో 104కు, 2021-22లో 98, 2022-23లో 116, 2023-24లో 120కు పెరిగాయి. వర్షాకాలంలో కూడా నగరంలో పీఎం-10 స్థాయి తగ్గలేదు. దేశంలో శనివారం అనేక నగరాల్లో గాలిలో ధూళిశాతం 'గుడ్, 'శాటిస్‌ఫెక్టరీ'గా ఉంటే విశాఖలో మాత్రం 'మోడరేట్'గా నమోదైంది. ఈ నెల ఒకటి నుంచి పదో తేదీ వరకు పీఎం-10 పరిశీలిస్తే సగటున 126 నుంచి 163 వరకూ నమోదైంది. నగరంలో లక్షల్లో వాహనాలు ఉండడం, భవన నిర్మాణాల సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, పోర్టు నుంచి బొగ్గు ధూళి, పరిసర పరిశ్రమల నుంచి ధూళి కణాలు వెలువడడంతో కాలుష్యం పెరిగిపోతోంది. నగరం మొత్తానికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ యంత్రం ఉంది. ఇక్కడ నమోదైన కాలుష్యం వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. నగరంలో మరికొన్నిచోట్ల యంత్రాలు ఏర్పాటుచేస్తే వాస్తవంగా కాలుష్య తీవ్రత ఎంత ఉందనేది తెలుస్తుందని పర్యావరణ నిపుణులు అంటున్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను జీవీఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం బదలాయించడంతోపాటు మరిన్ని నిధులు తీసుకురాగలితే నగరంలో కాలుష్యం నియంత్రణకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ మంత్రి పవన్‌కల్యాణ్ విశాఖలో కాలుష్యం తగ్గిస్తామని, ఇందుకు ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో మరిన్ని నిధులు తీసుకురాగలితే విశాఖతో పాటు రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో కాలుష్యాన్ని నియంత్రించ వచ్చునని అంటున్నారు.

సిక్ లీవులో మాజీ వీసీ ప్రసాదరెడ్డి

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు అందుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వివరాలు బయటకు చెబుతున్నారని కంప్యూటర్ సైన్స్ విభాగంలో బోధనేతర సిబ్బందిని మూకుమ్మడిగా ఎస్-3 సెక్షన్‌కు అటాచ్‌మెంట్ చేశారు. వారు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే నింద మోపారు. అది అసలు కారణం కాదని, రోజూ పత్రికల్లో ప్రసాదరెడ్డిపై వార్తలు రావడానికి వారే కారణమని భావించి చర్యలు తీసుకున్నారని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. దాంతో ఉలిక్కిపడిన అధికారులు ఇతర అంశాలు కూడా జోడించి వాటన్నింటిపై విచారణకు ఐదుగురు సభ్యులతో సెలవు రోజైన ఆదివారం కమిటీని నియమించారు. సోమవారం ఉదయాన్నే ఆ కమిటీ సభ్యులు కంప్యూటర్ సైన్స్ విభాగానికి వెళ్లి కూర్చున్నారు. బోధన సిబ్బంది ఎవరు ఏ సమయానికి వస్తున్నారో నమోదు చేసుకున్నారు. రోజూ 11.30 గంటలు దాటిన తరువాత రావడం అలవాటు చేసుకున్న ప్రసాదరెడ్డి ఇప్పుడు కమిటీ విచారణ చేస్తున్నదని సరిగ్గా 9 గంటలకు వస్తే...తాను తలవంచినట్టు అవుతుందని భావించి, రెండు రోజులు సిక్ లీవు పెట్టేశారు. అంటే ఆయన ఏ సమయానికి వస్తున్నారో కమిటీ నమోదు చేయడానికి వీలుండదు. నివేదికలో ఆయన ప్రస్తావన ఉండదు.

సిక్ లీవు ఎలా ఇచ్చారు?

ఈ విభాగంలో ఎవరైనా సెలవు పెట్టాలంటే ముందుగా హెచ్‌ఓడీకి సమాచారం ఇవ్వాలి. ఫోన్ చేసి చెప్పాలి. వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాలి. ఆ తరువాత లీవ్ లెటర్ పెట్టాలి. దానిని హెచ్‌ఓడీ నుంచి ఓఎస్‌డీకి పంపుతారు. ఇప్పుడు ప్రసాదరెడ్డి లీవుకు ఎప్పుడు దరఖాస్తు చేశారు? ఎప్పుడు మంజూరుచేశారో కూడా తెలియదు. ఆదివారం కమిటీ వేశారు. సోమవారం ఉదయానికి రిజిస్టర్‌లో ఆయన సిక్ లీవు అని రాసి ఉంది.

ఇంజనీరింగ్ కాలేజీ బాగోతాలు అన్ని ఉన్నాయా?

నెల రోజుల క్రితం వరకూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రస్తుత ఇన్‌చార్జి వీసీయే పనిచేశారు. ఇప్పుడు ఒక్కసారిగా ఆ కాలేజీ పరిధిలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో లెక్కలేనంత అవినీతి జరిగిపోతున్నదని ఫిర్యాదులు వచ్చాయంటూ కమిటీని వేశారు. ఆ ఫిర్యాదులు ఎప్పుడు వచ్చాయి?, ఇంతవరకూ ఎందుకు ఉపేక్షించారు?, ఆయన ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు ఎందుకు ఇలాంటి వాటిని నిరోధించలేకపోయారు?...అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల రోజుల్లోనే విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసే ప్రక్రియ ప్రారంభమైందా?, ఇంతకు ముందు లేదా? అప్పుడు ఏమి చేశారో?...అందరికీ అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉంది. అందరి బాగోతాలు బయటపెట్టాలంటే...సిబ్బంది హాజరుకు బయోమెట్రిక్ అమలు చేయాలి. అనేక చిన్న విద్యా సంస్థల్లో ఈ విధానం ఎప్పటి నుంచో ఉంది.

ఏయూ జోరు

... 5వ పేజీ తరువాయి

రాష్ట్రాల నుంచి ఉస్మానియా ఆరో స్థానంలో ఉంది.

ర్యాంకు కేటాయింపు ఎలా..?

ఈ ర్యాంకులు కేటాయించడానికి ముందు ఎన్‌ఐఆర్ఎఫ్ వర్సిటీలోని అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. విద్యార్థుల సంఖ్య, ఫ్యాకల్టీ అండ్ విద్యార్థుల రేషియో, పీహెచ్‌డీ చేసే విద్యార్థుల సంఖ్య, పరిశోధనలు, పబ్లికేషన్స్, ఆర్థిక వనరులు, వినియోగం, క్వాలిటీ ఆఫ్ పబ్లికేషన్స్ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సంస్థ ర్యాంకులను కేటాయిస్తుంది. ఏయూ మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అన్ని విభాగాల్లో టాప్‌లో నిలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు.

మెరుగుపడిన ఐఐఎం ర్యాంకు..

తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఐఐఎం విశాఖపట్నం కూడా మెరుగైన ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ కేటగిరీ జాబితాలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విశాఖపట్నం 59.20 స్కోరుతో 26వ స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాది 29వ స్థానంలో నిలిచిన ఐఐఎంవీ మూడు స్థానాలను మెరుగుపరుచుకుంది. గడిచిన కొన్నాళ్లుగా ర్యాంకును మెరుగుపర్చుకుంటూ వస్తోంది. 2022లో 33వ స్థానాన్ని సాధించగా, గత ఏడాది 29, ఈ ఏడాది 26వ స్థానాన్ని దక్కించుకుంది. మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఫ్యాకల్టీ, సిబ్బంది కృషితోనే మెరుగైన ర్యాంకు సాధ్యమైందన్నారు.

భీమిలి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన వివరణలో పొంతన లేకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే ఆ పార్టీలకు మేలు చేయాలని పెండింగ్‌లో పెట్టారని భావించి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ధర్మాన బంధువు తులసీదాస్

సస్పెండైన తులసీదాస్ శ్రీకాకుళం జిల్లా వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు బంధువు. విజయవాడలోని ఐజీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరి సీనియర్ అసిస్టెంట్ అయ్యారు. ఆ తరువాత గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొంది నక్కపల్లిలో పనిచేశారు. అక్కడ అనేక ఆరోపణలు వచ్చాయి. అక్కడి నుంచి సొంత జిల్లా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వెళ్లారు. అక్కడి నుంచి 2022లో మంత్రి ధర్మాన సాయంతో భీమిలి సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. దీనికి ముందు కొన్నాళ్లు ఆయన ధర్మాన వద్ద పీఏగా కూడా పనిచేశారు. భీమిలిలో రిజిస్ట్రార్ మన మనిషే కాబట్టి ఏమైనా చేసుకోవచ్చుననే ఆలోచనతో వైసీపీ నాయకులు ఈ ఇనాము భూములు కొట్టేయడానికి యత్నించారని తెలుస్తోంది.

డీపట్టా భూములు విక్రయం

- గత ప్రభుత్వ హయాంలో గుట్టుగా సాగిన వ్యవహారం
- ఎర్రమట్టిదిబ్బల్లో 50 ఎకరాల వరకూ అమ్మేసిన రైతులు
- జియోలాజికల్ సర్వేతో కొనుగోలుదారులు, రైతుల్లో భయాందోళన



జియో హెరిటేజ్ సైట్‌లో తొలగించిన స్తంభాలు

భీమునిపట్నం, ఆగస్టు 12 : బీచ్ రోడ్ ఎర్రమట్టిదిబ్బల్లో డీపట్టా భూముల అనధికారిక అమ్మకాల విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భీమిలి బిల్డింగ్ సొసైటీ ఎర్రమట్టి దిబ్బల్లో జరిపిన తవ్వకాలతో తలెత్తిన వివాదం నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ ప్రాంతంలో సర్వే ప్రారంభించిన విషయం తెలిసిందే. హెరిటేజ్ సైట్‌గా గుర్తించిన స్థలంలో బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన 91.50 సెంట్ల స్థలం ఉందని గుర్తించడంతో అప్పట్లోనే ఆ స్థలాన్ని సొసైటీ ప్రభుత్వానికి విడిచిపెట్టింది. ప్రస్తుత సర్వేలో సంబంధిత స్థలంలో వున్న సొసైటీ సిమ్మెంట్ కాంక్రీట్ స్తంభాలను తొలగించారు. అయితే 1978-79లో ఎర్రమట్టిదిబ్బల వెనుక భాగంలో వున్న భూములను నిడిగట్టు, నేరెళ్లవలస, రామయోగి అగ్రహారం గ్రామాలకు చెందిన నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు పంటల సాగు, ఫలసాయాన్ని అనుభవించడానికి ప్రభుత్వం డీపట్టాలు మంజూరు చేసింది. అప్పటి నుంచి జీడి మామిడి, నీలగిరి, ఆకేషియా పంటలు సాగు చేసుకుంటున్న రైతులు రెండేళ్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్ సమయంలో ఆయా భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించడానికి నిరాకరించారు. ఎకరాకి 950 చదరపు గజాల నివాస స్థలం ఇస్తామని అధికారులు చెప్పినా.. అంగీకరించలేదు. కానీ ఎప్పటికైనా ప్రభుత్వం తమ భూములను తీసుకుంటుందని భావించిన రైతులు వాటిని గత ఏడాది అమ్మకానికి పెట్టారు. ఒక్కో డీపట్టాకు రూ. 20 లక్షల వరకూ ధర పలకగా అడ్వాన్స్‌గా రూ. 2 లక్షల నుంచి 5 లక్షల వరకూ తీసుకున్నారు. ఆయా భూములను కొనుగోలు చేసిన గత ప్రభుత్వంలోని పెద్దలు వాటిని ఫ్రీ హోల్డ్ చేసుకోవడానికి రంగం సిద్ధం చేశారని సమాచారం. సుమారు యాభై ఎకరాల వరకూ అనధికారిక కొనుగోలు అగ్రిమెంట్‌లు జరిగినట్టు తెలిసింది. కూటమి అధికారంలోకి రావడం, జీవో 596ను పెండింగ్‌లో పెట్టడంతో ఈ వ్యవహారం కాస్త నెమ్మదించింది. అయితే ప్రస్తుతం ఎర్రమట్టిదిబ్బల్లో జరగుతున్న సర్వేతో ఈ భూములపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని కొనుగోలు చేసిన వారి తో పాటు రైతుల్లోనూ భయాందోళన నెలకొంది. కాగా ఈ విషయమై తహసీల్దార్ రామారావుతో మాట్లాడడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనలు చేసి షోడశోపచారాల పూజలు జరిపారు. అనంతరం నరసింహ సహస్రనామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

మందుబాబులకు జరిమానా

ఆనందపురం, ఆగస్టు 12 : మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి డి.సౌజన్య సోమవారం రూ. లక్ష జరిమానా విధించారు. మండలంలో పలుచోట్ల స్థానిక పోలీసులు ఇటీవల వాహన తనిఖీలు చేపట్టగా పది మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు చెప్పారు.

సాగర్‌నగర్‌లో పాము కలకలం



సాగర్‌నగర్, ఆగస్టు 12 : సాగర్‌నగర్ సచివాలయం పక్కనున్న రహదారిలో నాగుపాము సోమవారం కలకలం రేపింది. రోడ్డు మధ్యలోకి వచ్చి ఆగిపోవడంతో ఇరువైపులా వాహనదారులు నిలిచిపోయారు. ఇది సుమారు ఎనిమిది అడుగుల పొడవు ఉంటుంది. సమీపంలో ఉన్న వృద్ధుడు దాన్ని చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి విడిచిపెట్టాడు.

అవయవ దాతలకు గౌరవ వీడ్కోలు జీవోపై హర్షం

ఆరిలోవ, ఆగస్టు 12 : అవయవ దాతల భౌతిక కాయాలకు గౌరవ వీడ్కోలు పలకాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ చేయడం పట్ల భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు జె. రవి, టి. శ్రీరామ్మూర్తి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అవయవ దాతల అంతిమ సంస్కరణలకు రూ. 10 వేల ఇవ్వడంతో పాటు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించి కలెక్టర్, ఆర్‌డీఓ స్థాయి అధికారులు హాజరుకావాలని జీఓలో పేర్కొనడం అభినందనీయమన్నారు.

ఆరిలోవలో వర్షం

ఆరిలోవ, ఆగస్టు 12 : ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం పడింది. రాత్రి 7 నుంచి అర్ధ గంట పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మూడు రోజులుగా ఎండ, తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో సేదతీరారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం, ఆగస్టు 12 : పట్టణంలోని నేరేళ్లవలస కాలనీకి చెందిన వివాహిత నక్కాన పార్వతి (45) కొద్ది రోజులుగా కనిపించడం లేదని పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు అందింది. వివాహిత కోడలు ప్రియాంక తెలిపిన వివరాలు ప్రకారం.. పార్వతి, ఆమె కుమారుడు శివాజీ మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 10న ఆమె ఇల్లు విడిచివెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు స్థానికంగా, బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 38, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 20, పచ్చిమిర్చి 55, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 32, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 86, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	70
ఫారం ధర	--	90
విత్ స్కిన్	--	150
స్కిన్‌లెస్	--	160

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి జస్టిస్ ఎంవీ శేషమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ వెంకట శేషమ్మ

సింహాచలం, ఆగస్టు 12 : జీవీఎంసీ 98వ వార్డు సింహగిరిపై ఏళ్ల తరబడి నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందించాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి జస్టిస్ ఎం. వెంకట శేష మ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సింహగిరిపై ఆమె ఆధ్వర్యంలో గిరిజన హక్కులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల్లో అత్యధికులు నిరక్షరాస్యులు కావడంతో వారి హక్కులపై, ప్రభుత్వ పథకాలపై కనీస పరిజ్ఞానం లేకుండాపోయిందన్నారు. ఈనేపథ్యంలో అధికారులే స్వయంగా వారికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, వాటిని పొందేలా చూడాలన్నారు. అలాగే గిరిజన కాలనీలో పారిశుధ్యం, తాగునీరు, వీధి లైట్ల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జగదీశ్వరరావు, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ పాల్‌కిరణ్, ఐసీడీఎస్ పీడి జయదేవి, సీడీపీఓ ఎం. శ్రీదేవి, గిరిజనాభివృద్ధి శాఖ అధికారి జి సుబ్రహ్మణ్యం, జోన్-8 కమిషనర్ కె. హేమావతి, సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుదర్శన్, 98వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆగమ విద్యార్థులకు దండనపై నివేదిక ఇవ్వండి

దేవస్థానం ఈఓను కోరిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

సింహాలచం, ఆగస్టు 12 : సింహాచలం దేవస్థానం ఆధీనంలో నడుస్తున్న వేద, నాద,ఆగమ పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ దండన ఘటనలో విద్యార్థులు గాయపడడంపై పూర్తి నివేదిక అందజేయాలని ఈఓని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కోరింది. ఈమేరకు బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలకు స్పందిస్తూ గత 15 రోజుల్లో ముగ్గురు విద్యార్థులను గాయపరిచేలా దండించడాన్ని కమిషన్ ఖండిస్తోందని, దేవస్థానం ఈఓ అందజేసే నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్‌పై చర్యలకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఎంఈఓలతో విద్యా శాఖ ఆర్‌జేడీ సమావేశం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

భీమునిపట్నం, ఆగస్టు 12 : మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ విధానాన్ని విద్యాశాఖ జోన్-1 ఆర్‌జేడీ కె. విజయభాస్కర్ తనిఖీ చేశారు. ఈమేరకు ఆయన మండల వనరుల కేంద్రంలో ఎంఈవోలు శివరాణి, జయప్రదతో సమావేశమయ్యారు. ఎంఈవోలు తయారు చేసిన ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటిగా ఈ విధానం ఆన్‌లైన్‌లో జరుగుతున్నందున జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఆయనతో పాటు డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు మాణిక్యంనాయుడు ఉన్నారు.

దివీస్‌లో ముగిసిన భద్రతా మాసోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న దివీస్ ఉద్యోగులు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 12 : మండలంలోని చిప్పాడ దివీస్ కర్మాగారంలో నాలుగు నెలలుగా జరుగుతున్న భద్రతా మాసోత్సవాలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజు కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అగాహన కల్పించారు. ఈ సందర్భంగా కర్మాగారాల డైరెక్టర్ జి. చంద్రశేఖర్ వర్మ మాట్లాడుతూ కర్మాగారాల్లో జరిగే విపత్తుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎల్‌వీ రమణ మాట్లాడుతూ కర్మాగారంలో భద్రత కోసం అత్యధిక నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం భద్రతపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్మాగారాల సీఈఓ వి. సురేష్, ఇన్‌స్పెక్టర్ కె. సుధాకర్, జనరల్ మేనేజర్లు కె. సుబ్బారావు, వైఎస్. కోటేశ్వరరావు, భద్రతా అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు, ఆటోలపై కేసుల నమోదు

ఆనందపురం, ఆగస్టు 12 : నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాఠశాలల బస్సులు, ఆటోలపై రవాణా శాఖాధికారులు సోమవారం కేసులు నమోదు చేశారు. అధికారులు బృందాలుగా ఏర్పడి అడవివరం, ఆనందపురం, పెందుర్తి, వేపగుంట తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న నాలుగు బస్సులు, 12 ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జూన్ 13 నుంచి ఇప్పటివరకు 86 కేసులు నమోదు చేసి 9 స్కూల్ బస్సులను సీజ్ చేశామని చెప్పారు. అలాగే 38 ఆటోలపై కేసులు నమోదు చేసి 9 సీజ్ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు బాలాజీరావు, మాధవి, రాజారావు, పి. శిరీష, సుమన్ కుమార్, దుర్గా ప్రసాద్, పార్వతి పాల్గొన్నారు.

వీసీని అభినందించిన అడిషనల్ ఎస్పీ



వెంకోజీపాలెం, ఆగస్టు 12 : ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డి. గంగాధరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పన్న సేవలకు ఇత్తడి సామగ్రి బహూకరణ

సింహాచలం, ఆగస్టు 12 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ప్రతిరోజూ మూడు పూటలా ఆరాధనల్లో జరుపు నివేదలను తయారు చేసే వంటలకు వినియోగించాలని కోరుతూ ఒడిశాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు ఇత్తడి సామగ్రిని బహూకరించారు. మొత్తం ఐదు వంట సామగ్రిని ఆయన సోమవారం దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తికి అందజేశారు.

ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా ఏయూ



ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఆగస్టు 12 : ఏయూను ర్యాగింగ్ రహితంగా నిలపాలని ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్. విజయ్‌మోహన్ అన్నారు. సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ రహిత క్యాంపస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడడం, ప్రోత్సహించడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమని, ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిస కారాదని, ఆరోగ్యవంతమైన జీవనాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎస్.ఎం. యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు మిల్లెట్స్ చిత్రపటాన్ని బహుకరిస్తున్న విజయ్‌కుమార్

మిల్లెట్స్‌తో చంద్రబాబు చిత్రపటం

వెంకోజీపాలెం, ఆగస్టు 12 : నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ మిల్లెట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని తయారు చేశారు. ఈమేరకు సోమవారం ఆయన అమరావతిలో సీఎంను కలిసి చిత్రపటాన్ని బహూకరించారు. కేవలం మిల్లెట్స్ (చిరుధాన్యాలు) ఉపయోగించి, ఎలాంటి రంగులు వాడకుండా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. విజయ్‌కుమార్ తీర్చిదిద్దిన మిల్లెట్ చిత్రాన్ని స్వయంగా వీక్షించిన చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్ చిత్రకళా ప్రతిభను ప్రశంసించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వినతి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 12 : రాష్ట్రంలోని మహిళలకు ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలని జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ)కోరింది. ఈమేరకు వారు సోమవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఓలా, రాపిడో వంటి సంస్థలు మోటారు రంగంలోకి వచ్చిన తర్వాత ఆటోలకు బేరాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల తాము మరింత నష్టపోయే పరిస్థితి ఉందని చెప్పారు. పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ తాము ఆర్థికంగా ఇబ్బంది పడకుండా సొసైటీ ఏర్పాటు చేసి, డీజిల్, పెట్రోలు, నిత్యావసర ధరలు రాయితీపై ఇవ్వాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో 894 గజెట్ ద్వారా జీవో నెంబరు 21 తీసుకువచ్చి, వేలల్లో జరిమానా విధిస్తున్నారని తెలిపారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు షేక్ రెహమాన్, కాసుబాబు, సాయి, రాము, బాలాజీ, శ్రీను, సూర్యనారాయణ, గోవింద, కనకరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా



ఎంఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం, ఆగస్టు 12 : తమ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం వారు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మానవ వనరుల శాఖా మంత్రి లోకేశ్ జీవో నంబరు 117ను ఎత్తివేస్తామని, అప్రెంటిస్ విధానం రద్దు చేసి పూర్తిస్థాయి పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎంటీఎఫ్ నాయకులు అప్పలరాజు, రమాదేవి, రమణారావు, కె. సన్యాసినాయుడు, దాలయ్యబాబు, మోహన్, ప్రసాద్, అమరనాథ్, రాంబాబు, రాజు, పైడిరాజు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నిరసన

సిరిపురం, ఆగస్టు 12 : యూజీడీ కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి మాట్లాడుతూ యూజీడీ కార్మికులకు జీఓ నంబరు 36 ప్రకారం మార్చి నెల నుంచి వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. జీవీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీవో ప్రకారం జీతాలు ఫైల్ పెట్టారని కానీ గత కమిషనర్ సాయికాంత్ వర్మ బదిలీ వల్ల పెరిగిన జీతాలు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత కమిషనర్ తక్షణమే స్పందించి ఫైల్‌ను క్లియర్ చేసి, 1న కొత్త వేతనాలు ఏరియర్స్ పాటు చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, కార్యదర్శి రాజు, కోశాధికారి సూరీడు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో చిప్పాడ బాలికకు రజత పతకం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 12 : మండలంలోని చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొసన ఆదిలక్ష్మికి బాక్సింగ్ పోటీల్లో (42 కిలోల విభాగం) రజత పతకం లభించింది. భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హరియాణాలోని రోహతక్‌లో గత వారం జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఇందులో ఆమె రజత పతకం సాధించింది. బాలికను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. అప్పారావు, ఎస్. విజయకుమార్, సుకుమార్, రాజేశ్వరి తదితరులు అభినందించారు. కాగా బాలిక తండ్రి చనిపోగా తల్లి టీ దుకాణం పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. వచ్చే నెల నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆమె దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

వెంకోజీపాలెం, ఆగస్టు 12 : యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వీఎస్‌కృష్ణా గ్రంథాలయం చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి. వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం పురస్కరించుకుని గ్రంథాలయ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో లైబ్రేరియన్లకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన రంగనాథన్ జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఏయూ గ్రంథాలయంలో ఐదు లక్షలకు పైగా పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సిబ్బంది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో ఎస్సార్ రంగనాథన్ 133వ జయంతి పురస్కరించుకుని గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రత్యూష, హెల్త్ సెక్రటరీలు జక్కమ్మ, సుభాషిణి, గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎస్‌వీ నరసింహం కోరారు. జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకముందు గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాది కె. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఏయూలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య పి. వెంకటేశ్వర్లు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ

ఆరిలోవ, ఆగస్టు 12 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ గోవిందరావు సూచించారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని డీవైఎఫ్ విశాఖ జిల్లా కమిటీ స్థానిక యువతకు సోమవారం వాలీ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తాగి గొడవ చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండాలని, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. పోటీల్లో 20 జట్లు పాల్గొనగా ముత్యమాంబ యూత్, వైజాగ్ శ్రీను జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో డీవైఎఫ్ నాయకులు శంకర్రావు, శ్రావణ్, ముఖేష్, రాజు, పవన్ రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ గోవిందరావు